ఆక్రమణ చెరలో కీసర గండేపల్లిరోడ్డు

- రోడ్లను ఆక్రమించి ఇళ్లు, షాపుల నిర్మాణం
- కుంచించుకుపోయిన రోడ్డు
- నిత్యం ట్రాఫిక్ కష్టాలు
- ఇబ్బందుల్లో వాహనదారులు


గండేపల్లి నుంచి కీసర వెళ్లే రోడ్డు ఆక్రమణల కారణంగా నిలిచిన ట్రాఫిక్

కంచికచర్ల: ప్రయాణికులు, వాహనదారులతో నిత్యం రద్దీగా ఉండే గండేపల్లి–కీసర ఆర్అండ్బీ రోడ్డు ఆక్రమణలకు గురికావడంతో రోడ్డంతా కుంచించుకుపోయింది. దీంతో ప్రజలు, ప్రయాణికులు, వాహనదారులు నిత్యం అవస్థలు పడుతున్నారు. ఆక్రమణకు గురైన రోడ్డును సర్వే చేసి రోడ్డు పక్కన నిర్మించిన అక్రమ కట్టడాలను తొలగించాలని పలు గ్రామాల ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్న ఆర్అండ్బీ అధికారులు పట్టించుకోవడం లేదు.

రోడ్డు ఆక్రమించి షాపుల ఏర్పాటు..

కంచికచర్ల మండలంలోని 65వ నెంబర్ జాతీయ రహదారి కీసర గ్రామం నుంచి గండేపల్లి వెళ్లే ఆర్అండ్బీ రోడ్డును కొంతమంది వ్యక్తులు రెండువైపులా ఆక్రమించుకుని అక్రమంగా దుకాణాలు, ఇళ్ల నిర్మాణం చేపట్టారు. దీంతో రోడ్డు విస్తీర్ణం తగ్గిపోయి ఇరుకుగా మారింది. వాహనాలు ఆ రోడ్డు ట్రాఫిక్ నుంచి బయటపడాలంటే కనీసం అర్ధగంటపైనే పడుతోందని ప్రయాణికులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిత్యం వాహనాల రద్దీ..

ఈ రోడ్డు కంచికచర్ల మండలంలోని గండేపల్లి గ్రామాన్ని కలుపుకుంటూ వీరులపాడు మండలం జమ్మవరం, బోడవాడ, నందలూరు, తాటిగుమ్మి, జుజ్జూరు తదితర గ్రామాలకు వెళ్తుంది. అంతేకాకుండా ఇదేరోడ్డుకు తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం వరకు వాహనదారులు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. అదేవిధంగా గండేపల్లి గ్రామ సమీపంలో ఉన్న కర్మాగారానికి చెందిన కార్మికులు కూడా నిత్యం వందల సంఖ్యలో బస్సులు, ఆటోలు, ద్విచక్రవాహనాల్లో రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో ఈరోడ్డులో ట్రాఫిక్ అధికంగా ఉంటుండంతోపాటు రోడ్డుపైనే ఉన్న షాపుల కారణంగా కూడా తరచూ వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ సమస్య మరింత పెరుగుతోంది.

రోడ్లపైనే వాహనాల నిలుపుదల..

ఈక్రమంలో రోడ్డును ఆక్రమించి నిర్మించిన షాపులకు వచ్చే కొనుగోలుదారులు కూడా వారి వాహనాలను రోడ్డుపై నిలుపుదల చేస్తున్నారు. కీసర, గండేపల్లి గ్రామాల్లో రోడ్డు మార్జిన్లను దర్జాగా ఆక్రమించుకుని షాపులు కట్టిన కొందరు వ్యక్తులు వ్యాపారాలు కొనసాగిస్తుండగా, మరికొందరు ఆయా షాపులను అద్దెకు ఇచ్చి ప్రతినెలా వేలాది రూపాయలను వసూలు చేసుకుంటున్నారు. ఇలా షాపుల నిర్మాణం కారణంగా 40 అడుగుల రోడ్డు కాస్తా పది అడుగులకు మించి లేని పరిస్థితి. అంతేకాకుండా దుకాణాల ఎదుట వాహనాలను పార్కింగ్ చేస్తుండటంతో రోడ్డు ఇరుకుగా మారి వాహనదారులు పలు ఇబ్బందులు పడుతున్నారు. గండేపల్లి సెంటినీ కర్మాగారానికి చిన్నస్థాయి వాహనాల నుంచి భారీస్థాయి కంటైనర్లు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. ఇటీవల రోడ్డుపై పడిన పెద్ద పెద్ద గోతులను సెంటినీ కంపెనీ యాజమాన్యం పూడ్చివేసింది. అయితే రోడ్డు ఆక్రమణల కారణంగా నిత్యం ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదు. ఇకనైనా ఆర్అండ్బీ, జిల్లా పరిషత్ అధికారులు స్పందించి ఆక్రమణపాలైన గండేపల్లి–కీసర ఆర్అండ్బీ రోడ్డులో ఆక్రమణలను తొలగించడంతోపాటు రోడ్డు అభివృద్ధికి తగు చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు, ప్రయాణికులు కోరుతున్నారు.

వరి గడ్డికి డిమాండ్


తెలంగాణలో కొనుగోలు చేసి ట్రాక్టర్పై తీసుకొస్తున్న వరిగడ్డి

జగ్గయ్యపేట: వరిగడ్డికి విపరీతమైన డిమాండ్ పెరిగింది. దీంతో పశుపోషకులు నానా అవస్థలు పడుతున్నారు. నియోజకవర్గంలోని జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల్లోని పలు గ్రామాల్లో పశువులు అధికంగా ఉన్నాయి. దీంతో వరిగడ్డి కొరతతో పశుపోషకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో వరిగడ్డి కట్ట రూ. 110 ఉండగా ప్రస్తుతం 150 నుంచి 200 వరకు విక్రయిస్తున్నారు. పశుపోషకులు కూడా చేసేది లేక కొనుగోలు చేస్తున్నారు. మూడు నెలల క్రితం వచ్చిన వర్షాలు, వరదల కారణంగా పంట దెబ్బతింది. మిగిలిన అరకొర సాగులో కూడా యంత్రాలను వినియోగించడంతో గడ్డి పనికిరాకుండా పోతుందని రైతులు అంటున్నారు. వాతావరణ శాఖాధికారులు చేస్తున్న తుఫాన్ హెచ్చరికలతో రైతులు భూమిలో తేమ పూర్తిగా ఆరకుండానే యంత్రాలతో కోతలు కోస్తుండటంతో వరిగడ్డి యంత్రాల చక్రాల కింద నలిగి వినియోగానికి పనికి రావటం లేదని పలువురు అంటున్నారు. పోషకులు సమీపంలోని తెలంగాణ నుంచి వరి గడ్డిని కొనుగోలు చేయాల్సి వస్తుందని పలువురు పశుపోషకులు అంటున్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు

వీరులపాడు: వాహనదారులు నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ అనిల్ తెలిపారు. మండలంలోని పెద్దాపురం గ్రామ సమీపంలో ఆదివారం ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించటం వల్ల ప్రమాద సమయంలో తీవ్రత అధికంగా ఉంటుందని చెప్పారు. అంతే కాకుండా వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలను విధిగా వెంట ఉంచుకోవాలని సూచించారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. నిబంధనలు పాటించకుండా తిరుగుతున్న పలు వాహనాలను గుర్తించి వారికి అవగాహన కల్పించటంతో పాటు జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులు సమాజ సేవకు కృషి చేయాలి

వీరులపాడు: ఆర్యవైశ్య కార్యవర్గం సమాజ సేవ కోసం కృషి చేయాలని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తెలిపారు. మండలంలోని జుజ్జూరు గ్రామంలో మండల ఆర్యవైశ్య కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి కృషి చేసి మంచి పేరు తెచ్చుకోవాలని కోరారు. ఆర్యవైశ్యులు వ్యాపార రంగంలోనే కాకుండా రాజకీయాల్లోనూ రాణించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు రజని, లక్ష్మీ, చిన్న రామసత్యనారాయణ, బొగ్గవరపు వెంకట రాజారావు, తుమ్మేపల్లి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. ఆర్యవైశ్య సంఘం గౌరవాధ్యక్షుడిగా పైడిమర్రి జగన్మోహనరావు, అధ్యక్షుడిగా పబ్బతి రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా దూపగుంట్ల శ్రీనివాసరావు, కోశాధికారిగా శ్రీనివాసరావులతో పాటు సభ్యులను ఎన్నుకున్నట్లు ఆర్యవైశ్య సంఘ నాయకులు తెలిపారు.

రాంబాబు సేవలు స్ఫూర్తిదాయకం

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్చార్జ్ తన్నీరు


పదవీ విరమణ చేసిన రాంబాబును సన్మానిస్తున్న తన్నీరు నాగేశ్వరరావు తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: ప్రధానోపాధ్యాయుడుగా ఎందరో విద్యార్థులను విద్యావేత్తలుగా తీర్చిదిద్దిన సీతా రాంబాబు సేవలు స్ఫూర్తిదాయకమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. పట్టణంలోని విష్ణుప్రియనగర్కు చెందిన సీతారాంబాబు పేట మండలంలోని షేర్మహ్మద్పేట జెడ్పీ హైస్కూల్లో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహించి పదవీ విరమణ చేసిన సందర్భంగా ఆదివారం స్థానిక షేర్మహ్మద్పేట క్రాస్రోడ్లోని పీవీఆర్ గార్డెన్స్లో పదవీ విరమణ అభినందన సన్మాన సభ ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ అన్ని వృత్తుల్లో కెల్లా ఉపాధ్యాయ వృత్తి చాలా ప్రాముఖ్యమైందని చెప్పారు. రేపటి పౌరులను తీర్చిదిద్దటం ద్వారా ఉపాధ్యాయులు సమాజ నిర్మాణంలో ప్రముఖ పాత్ర పోషిస్తారని తెలిపారు. అలాంటి వృత్తి ద్వారా రాంబాబు ఎంతో మంది విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దటం ద్వారా ఆయన జీవితం ధన్యం చేసుకున్నారని తెలిపారు. ఇలాంటి అరుదైన అవకాశం ఒక్క ఉపాధ్యాయులకే ఉంటుందన్నారు. కార్యక్రమంలో విజయవాడ కనకదుర్గ అమ్మవారి దేవస్థానం డైరెక్టర్ నంబూరి రవి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ నాయకులు కన్నమాల శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

కళాకారుల కోసం వేదిక అభినందనీయం

ఎమ్మెల్యే తాతయ్య


నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

జగ్గయ్యపేట అర్బన్: నూటొక్క దేవాలయాల పట్టణంగా, ఆధ్యాత్మిక కేంద్రంగా, రంగస్థల నటులకు, కవులకు, సాహితీవేత్తలకు ప్రసిద్ధి చెందిన జగ్గయ్యపేట పట్టణంలో కళాకారుల కోసం శ్రీకళావేదిక ఆధ్యాత్మిక సాంస్కృతిక కళావేదిక ఆవిర్భవించడం అభినందనీయమని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక ఉక్కుకళావేదికలో జరిగిన శ్రీకళావేదిక సంస్థ ఆవిష్కరణోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే తాతయ్య మాట్లాడారు. జగ్గయ్యపేటలో ఉన్న సంగీత, సాహిత్య, నాట్య, నాటక, చిత్రకళ, శిల్ప కళాకారుల సంక్షేమం కోసం శ్రీకళావేదిక సంస్థను ఏర్పాటుచేయడం ద్వారా వారందరిని ఒక వేదిక మీదకు తీసుకువచ్చే ప్రయత్నం చాలా మంచిందని తెలిపారు. ఈ సంస్థ అభివృద్ధికి ప్రభుత్వ పరంగా తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. మరొక అతిథిగా పాల్గొన్న కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ కళాకారులకు పుట్టినిల్లు అయిన జగ్గయ్యపేటలో ఇలాంటి సంస్థలు ఏర్పాటుచేయడం అవసరం అని సంస్థ నిర్వాహకులను అభినందించారు. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర మాట్లాడుతూ కళాకారుల సంక్షేమం కోసం ఇలాంటి సంస్థలు దోహదపడతాయని పేర్కొన్నారు. వారికి తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు. అనంతరం అతిథులు శ్రీకళా లోగోను ఆవిష్కరించి, కళాకారులను సత్కరించారు. కూచిపూడి నృత్య కళాకారులు భారతీదేవి శిష్య బృందం, దుడకా ఉజ్వల వారి సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కౌన్సిలర్లు కె.రామలక్ష్మి, బుజ్జిబాబు, కళావేదిక ప్రతినిధులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

భవానీపురం(విజయవాడపశ్చిమ): నేషనల్ కరాటే చాంపియన్షిప్–2024 పోటీల్లో జేకే గోజూ రియో కరాటే అకాడమీ (జీకేఏ) సత్యనారాయణపురం బ్రాంచ్ విద్యార్థులు తమ ప్రతిభను చాటి ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. విజయవాడ పటమటలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన ఈ పోటీల్లో సత్యనారాయణపురం బ్రాంచి విద్యార్థులు బి. హిమశ్రీ (11), బి.ఆద్య శ్రీ (9), వై.వరుణ్ (9), వై.లీలానాథ్ (10), జి.సహస్ర (13) ప్రథమ స్థానంలో గెలుపొందారు. ద్వితీయ స్థానంలో ఎస్కె అయాన్(10), జి.క్షేత్రజ్ఞ (10), కె.లీలాకృష్ణ (11) నిలిచారు. టోర్నమెంట్ను డాక్టర్ యు.బ్రహ్మానందం, యు.విజయ కుమార్, కె. శ్రీనివాస్, సీహెచ్ పూర్ణ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు, అతిథులుగా జేకే జీకేఏ వ్యవస్థాపకుడు జె. శ్రీనివాసులు, టెక్నికల్ డైరెక్టర్ జె.హరినాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజేతలను జేకే జీకేఏ సత్యనారాయణపురం బ్రాంచి హెడ్ కోచ్ పీవీకెఎస్ హర్ష, ఇతర బ్రాంచిల కోచ్లు టీవీ సాయి కుమార్, నరసింహ అభినందించారు.


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు


చండీ హోమం నిర్వహిస్తున్న వేద పండితులు


అమ్మవారికి బోనాలు తెస్తున్న భక్తులు

తిరుతమ్మ తల్లీ...కరుణించమ్మా..

పెనుగంచిప్రోలు లక్ష్మీ తిరుపతమ్మ ఆలయం ఆదివారం భక్తులతో రద్దీగా మారింది. తెలంగాణతో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. పాలు, పొంగళ్లతో బోనాలు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. హోమశాలలో వేద పండితులు చండీ హోమం ఘనంగా నిర్వహించారు.

\- పెనుగంచిప్రోలు

అలరించిన ఆంధ్ర నాట్య ప్రదర్శనలు

భవానీపురం: దేవస్థానం ప్రాంగణంలోని కళావేదికపై విజయవాడకు చెందిన రాజేశ్వరి నృత్యనికేతన్ బృందం ఆదివారం ప్రదర్శించిన ఆంధ్ర నాట్య ప్రదర్శనలు భక్తులను అలరించాయి. నాట్యాచారిణి ఆర్వీస్వై రాజేశ్వరి నేతృత్వంలో చిన్నారి కళాకారిణులు తిలోత్తమ బాయి, లక్ష్మీ చైత్ర, తనుశ్రీ, రిషిత, ఉషారాణి, పియూష, హస్విక, నవ్య, హర్షప్రియ, భవానీ తదితరులు నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. అలరింపు, వినాయక కౌతం, దశావతారాలు, థిల్లాన, సంధ్య సమయం, వేణుగాన అంశాలకు చక్కని హావభావాలతో అభినయించారు.

పారిశ్రామికవేత్తల మోజులో మోదీ ప్రభుత్వం

సీపీఎం జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ


మాట్లాడుతున్న డీవీ కృష్ణ

జగ్గయ్యపేట: పారిశ్రామిక వేత్తల మోజులో ప్రధాని మోదీ ప్రభుత్వం కూరుకుపోయిందని సీపీఎం జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ పేర్కొన్నారు. పట్టణంలోని డీవీఆర్ నగర్లోని సీపీఎం పార్టీ కార్యాలయంలో మండలంలోని ఐదవ మహాసభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడవ సారి అధికారంలోకి వచ్చిన కేంద్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించి పారిశ్రామిక వేత్తల మోజులోనే కాలం వెళ్లదీస్తున్నారన్నారు. దేశ వ్యాప్తంగా రాష్ట్రాల అభివృద్ధిని గాలికొదిలారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నా కనీసం ఎన్నికల హామీలను కూడా అమలు చేయటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా రైతులు కూడా మద్దతు ధర లేక ఇబ్బందులు పడుతున్నా కనీసం పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అమలు కాని హామీలిచ్చి వాటిని అమలు చేయలేక ప్రజలపై భారం మోపుతున్నారని పేర్కొన్నారు. విద్యుత్ చార్జీలను పెంచి సామాన్యులపై పెను భారం మోపిందని దుయ్యబట్టారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు చేయి దాటిపోతున్నా మోడీ స్పందించకపోవటం సిగ్గు చేటని తెలిపారు. పన్నుల భారం మోపటం మానుకోకుంటే పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమం చేస్తానని హెచ్చరించారు. అనంతరం కార్యదర్శిగా సోమోజు నాగమణితో పాటు 12 మంది సభ్యులతో కూడిన నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సీహెచ్ శ్రీనివాసరావు, చిరుమామిళ్ల హనుమంతరావు, రాము, దంతాల వెంకటేశ్వర్లు, వెంకట్రావ్, రాజేశ్వరీ, రామనాదం, తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘ మండల కమిటీ ఎన్నిక


ఆర్యవైశ్య సంఘ మండల కమిటీని ఎన్నుకున్న సంఘ నాయకులు

కంచికచర్ల: వాసవి కన్యకాపరమేశ్వరి కల్యాణ మండలంలో ఆర్యవైశ్యుల సమావేశం ఆదివారం జరిగింది. ఆర్యవైశ్య సంఘ మండల అధ్యక్షుడు అత్తులూరి యాదగిరి నరసింహారావు, జిల్లా ఆర్యవైశ్య సంఘ ప్రధాన కార్యదర్శి నాళ్ల సత్యంబాబు ఆధ్వర్యంలో ఆర్యవైశ్య సంఘ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడిగా జల్లా తిరుపతి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా పెరుమల్ల యశ్వంత్, కోశాధికారిగా ఊటుకూరు కుమార్ను ఎన్నుకున్నారు. ఎన్నికయిన కమిటీ సభ్యులు వచ్చే ఏడాది జనవరి 5న ప్రమాణ స్వీకారం చేస్తారని అధ్యక్షుడు తెలిపారు. ఎన్నికయిన వారిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకులు చంద్రుపట్ల రవికిషోర్, జూలూరు విశ్వనాథం, పమిడిమర్రి పవన్, కొప్పు నాగరాజు, జూలూరు శ్రీనివాసరావు, వేములపల్లి వెంకటరత్నం, గుండా దుర్గారావు, గుండా విశ్వనాథం, పబ్బత సాయి, జల్ల హనుమంత్కుమార్, దొడ్డ మహేష్, గుండా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులతో మర్యాదగా ఉండాలి


వత్సవాయి పోలీస్స్టేషన్లో రికార్డులను తనిఖీచేస్తున్న ఏసీపీ తిలక్

వత్సవాయి: స్టేషన్కు వచ్చే ఫిర్యాదుదారులపట్ల మర్యాదతో కూడిన ప్రవర్తన ఉండాలని నందిగామ ఏసీపీ ఏబీజీ తిలక్ సూచించారు. వత్సవాయి పోలీస్స్టేషన్ను ఆదివారం ఆయన తనిఖీ చేశారు. ముందుగా స్టేషన్ పరిసరాలను పరిశీలించి అనంతరం రికార్డులు తనిఖీ చేశారు. ఏదో ఒక సమస్య మీద ప్రజలు స్టేషన్ మెట్లు ఎక్కుతారని చెప్పారు. అటువంటి వారిపట్ల పోలీసులు సానుకూలంగా వ్యవహరించి వారి సమస్యను పరిష్కరించేలా చూడాలని సూచించారు. వీలైనంతవరకు గ్రామస్థాయిలో చిన్నపాటి తగాదాలను ఆయా గ్రామాల్లోని పెద్దల సమక్షంలోనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. స్టేషన్లు, కోర్టులు అంటూ విలువైన సమయాన్ని వృథా చేసుకోకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఎస్ఐ పి.ఉమామహేశ్వరరావు పనితీరును ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో జగ్గయ్యపేట సీఐ వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య సమస్య పరిష్కారానికి చర్యలు


డ్రెయిన్లలో పూడిక తీత పనులు పరిశీలిస్తున్న కమిషనర్

నందిగామ టౌన్: పారిశుద్ధ్య సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ రమణబాబు తెలిపారు. పట్టణంలోని ప్రధాన రహదారుల్లో ఆదివారం పారిశుద్ధ్య ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన రహదారులకు ఇరుపక్కలా ఉన్న డ్రెయిన్లలో పూడికతీత పనులు చేపడుతున్నామని తెలిపారు. ప్రజలు చెత్తాచెదారాలను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా ఇంటి వద్దకు చెత్త సేకరణకు వచ్చే సిబ్బందికి అందించాలని లేకుంటే చెత్త కుండీలను వినియోగించాలని సూచించారు. పట్టణంలో పారిశుద్ధ్య సమస్య పరిష్కారానికి ప్రజలు కూడా తమ వంతు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా కంటి వైద్య పరీక్షలు


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

కొణకంచి(పెనుగంచిప్రోలు): గ్రామంలో పారామౌంట్ ఫౌండేషన్, శంకర కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని రోగులకు వైద్యులు కంటి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పారామౌంట్ అదినేత సురేష్, ఎండీ ప్రీతంబాబు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

120 మందికి కంటి వైద్య పరీక్షలు

నందిగామ టౌన్: ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకే సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు సమితి సభ్యుడు వాసుదేవరావు తెలిపారు. పట్టణంలోని భగవాన్ సత్యసాయి మందిరంలో శంకర కంటి ఆస్పత్రి సౌజన్యంతో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య శిబిరంలో 120 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించామని చెప్పారు. వీరిలో 43 మందికి కంటి శుక్లాల శస్త్ర చికిత్స అవసరమని వైద్యులు గుర్తించారని వారిని ప్రత్యేకంగా బస్సులు ఏర్పాటు చేసి పెద్దకాకానిలోని శంకర కంటి ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

క్లుప్తంగా

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

కంచికచర్ల: ప్రజా సమస్యల పరిష్కార వేదిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుందని తహసీల్దార్ పి. జాహ్నవి ఆదివారం తెలిపారు. సమస్యలు పరిష్కరించేందుకు ప్రజలు అర్జీలు దాఖలు చేసుకోవాలని పేర్కొన్నారు. వచ్చిన అర్జీలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామన్నారు.

వయ్యారిభామతో నష్టాలు ఎక్కువ



మక్కపేట(వత్సవాయి): రైతులు వయ్యారిభామ పట్ల అప్రమత్తంగా ఉండాలని బాపట్ల వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కె.శ్రీనివాసులు తెలిపారు. వ్యవసాయ కళాశాల విద్యార్థులు గ్రామీణ పని అనుభవ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 11 వరకు జాతీయసేవ పథకంలో భాగంగా గ్రామంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పంట పొలాల్లో పెరిగే వయ్యారిభామ గురించి రైతులకు వివరించారు. వీటి నివారణ ఒక్కటే మార్గమన్నారు. మందులకు కూడా ఇది పోదని చెప్పారు. చిన్న మొక్కగా ఉన్నప్పుడే వీటిని వేర్లతో సహా తొలగించి విత్తనం పడకుండా కాల్చివేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సొసైటీ అధ్యక్షుడు కొండబోలు బ్రహ్మం రైతులు పాల్గొన్నారు.

11న ఆలయ హుండీ లెక్కింపు

వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయ హుండీ కానుకల లెక్కింపు ఈ నెల 11న నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో సురేష్బాబు ఆదివారం తెలిపారు. ఉదయం 10 గంటలకు దేవదాయ శాఖాధికారుల సమక్షంలో లెక్కింపు జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన భక్తులు లెక్కింపులో పాల్గొనాలని కోరారు. ఆలయంలో అమలవుతున్న నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్కు చెందిన పెరుమాళ్ల వీర వెంకట సత్యనారాయణ మూర్తి రూ. 11,116 అందించారని తెలిపారు.

రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన



కంచికచర్ల: గ్రామాల్లో రోడ్లు అభివృద్ధి చేసేందుకు అవసరమైన నిధులు మంజూరయ్యాయని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య తెలిపారు. కంచికచర్ల జుజ్జూరు రోడ్డులో నెహ్రూబొమ్మ సెంటర్ నుంచి భావనా థియేటర్ సెంటర్ వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులకు ఆదివారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సౌమ్య మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించి అభివృద్ధి పనులు చేపట్టామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వేల్పుల సునీత, ఎంపీటీసీ సభ్యులు నాయకులు కోగంటి బాబు, నన్నపనేని నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావం విజయవంతం చేయాలి



నందిగామ టౌన్: హిందూ ఆలయాలు, ఆస్తులు పరిరక్షణ నిర్వహణలో చేయాల్సిన సంస్కరణలపై హిందువులు ఏకం కావాలని ఆర్ఎస్ఎస్ విభాగ్ వ్యవస్థాపక ప్రముఖ్ దివ్వెల కృష్ణ తెలిపారు. విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక ముక్కోటి మహా మండపంలో ఆదివారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గన్నవరం సమీపంలోని గ్రీన్మెడోస్ స్థలంలో జనవరి ఐదున నిర్వహిస్తున్న హైందవ శంఖారావం బహిరంగ సభ విజయవంతానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. తెలుగు రాష్ట్రాల్లో ఆలయాల నిర్వహణ పూర్తిగా దెబ్బతిందని అన్యాక్రాంతమైన ఆలయాలు, ఆస్తుల పరిరక్షణకు హిందువులంతా ముందుకు రావాలని కోరారు. ఈ సమావేశంలో తొర్లికొండ సీతారామయ్య, కొమరగిరి వాచస్పతి, అడపా స్వామి, తదితరులు పాల్గొన్నారు.

పశుగణన వేగంగా చేస్తాం

పెనుగంచిప్రోలు: మండలంలో 21 వ జాతీయ పశుగణన కార్యక్రమం వేగంగా జరుగుతోందని పశువైద్యాధికారి పి.అనిల్ తెలిపారు. ఈ నెల 8న సాక్షి దినపత్రికలో వచ్చిన 'పశువుల లెక్క తేలేనా.?' అనే కథనానికి అధికారులు స్పందించారు. దీనిపై ఆదివారం ఆయన మాట్లాడుతూ శిక్షణ పూర్తి చేసుకున్న ఎన్యూమరేటర్లకు ఒక్కొక్కరికి 2000 గృహాలను కేటాయించి రోజుకు కనీసం 50 గృహాలు సర్వే చేసేలా నిర్దేశించామని చెప్పారు. ఫిబ్రవరి 2025 కల్లా నూరుశాతం గృహాలు సందర్శించి సర్వే పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ఈ నెల 8వ తేదీ వరకు 14,946 గృహాలకు గాను 6,254 గృహాల్లో సర్వే పూర్తి చేశామన్నారు.